# ద్రావిడ విశ్వవిద్యాలయంలో వేమన జయంతి వేడుకలు

తేది: 19.01.2017

యోగివేమన జయంతిని పురస్కరించుకొని ద్రావిడ విశ్వవిద్యాలయంలోని భాషా భవనం సెమినార్ హాలులో ఉపాధ్యక్షులు ఆచార్య ఈడిగ సత్యనారాయణ అధ్యక్షతన తెలుగు శాఖ ఆధ్వర్యంలో వేడుకలను జరిపారు. ఈ సందర్భంగా ఆచార్య ఈడిగ సత్యనారాయణ గారు మాట్లాడుతూ... వేమన సమాజంలోని అసమానతలను, మూడనమ్మకాలను పోగొట్టడానికి పదునైన పదజాలంతో పద్యరచన చేశాడన్నారు. వేమన రచనలు నేటికి కూడా సమాజానికి ఎంతో అవసరమన్నారు. వేమన సమకాలీన పరిస్థితులకు తగ్గట్టు రచనలు చేసినప్పటికీ అవి నేటికి కూడా సమాజానికి ఎంతో అవసరపడుతున్నాయని అన్నారు. ఆయన రచనలు అప్పుడు, ఇప్పుడే కాదు ఎప్పటికీ వినదగ్గ, చదవదగ్గ రచనలు, పాటించదగ్గ విషయాలు అని తెలిపారు. వేమన రచనలు సరళమైన భాషతో అందరికీ అర్థమయ్యే భావజాలంతో ఉంటాయని తెలిపారు. యువత ఫేస్‌బుక్‌లు చూడటం మాని వేమన లాంటి వారు రాసిన పుస్తకాలను చదవాలని ఈ సందర్భంగా సూచించారు. ద్రావిడ విశ్వవిద్యాలయ తొలి మహిళ ఆచార్య దేవికి గారు మాట్లాడుతూ... వేమన తన రచనల్లో పోషక విలువలను, వాటి ప్రాధాన్యతను తెలిపే విధంగా రచనలు చేశారని ఉదహరిస్తూ “నెయ్యి లేని కూడు నీయాన కసువది, కూరలేని తిండి కుక్క తిండి, ప్రియము లేని కూడు పిండపు కూడురా, విశ్వదాబిరామ వినురవేమ” అన్న పద్యాన్ని వివరించారు. ద్రావిడ విశ్వవిద్యాలయానికి గతంలో ఇన్‌చార్జి వీసీగా వ్యవహరించిన ఆచార్య ఎన్.గోపి గారు చరవాణి ద్వారా మాట్లాడుతూ.. వేమన పుట్టిన రోజు సాహసం పుట్టిన రోజుగా, మానవత్వం పుట్టిన రోజుగా అభివర్ణించారు. ఈ సందర్భంగా కన్నడంలో సర్వజ్ఞులు, ఉత్తర భారతంలో కబీర్, తమిళంలో తిరువళ్ళువర్‌లను స్మరించుకున్నారు. వేమనను విశ్వకవి అనడంలో ఎటువంటి సందేహం లేదని తెలుపుతూ ద్రావిడ విశ్వవిద్యాలయం ప్రచురణల కేంద్రం ద్వారా వేమన రచనల్ని అన్ని ద్రావిడ భాషల్లోకి అనువదించాల్సిందిగా కోరారు. డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య పెంచలయ్య గారు మాట్లాడుతూ... వేమన కాలం, ప్రాంతం గురించే కాకుండా ఆయన రాసిన పద్యాల సేకరణలో సాహిత్య పరిశోధకులు ఒక్కొక్కరు ఒక్కో రకంగా పేర్కొన్నారన్నారు. వేమన వేదాలు, ఉపనిషత్తులు చదివినట్లు ఎక్కడా తెలపలేదని, కానీ ఈయన రచనల్లో వేదాంతం మొదలైన కోణాలు కన్పిస్తాయని తెలలిపారు. తెలుగు శాఖాధ్యక్షులు డా. చిన్నరెడ్డయ్య మాట్లాడుతూ... ఆంధ్ర రాష్ట్రంలో వేమన రచనలు సమాజాన్ని ఎంత ప్రభావితం చేశాయో అదేవిధంగా కన్నడ రాష్ట్రంలో సర్వజ్ఞుడు రాసిన రచనలు ప్రజా మన్నన పొందాయని, సర్వజ్ఞుడు, వేమనల ఆలోచనా ధోరణి, రచనా విధనంలో పోలికలున్నాయని అన్నారు. తెలుగు శాఖ సహాయ ఆచార్యులు డా.వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ... మానవతావాదంతో తన రచనల ద్వారా సమాజంలోని సత్యాన్ని ప్రజలకు తెలియజేశాడన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య రాజేంద్రప్రసాద్, ఆచార్య శ్రీనివాసకుమార్, ఆచార్య డి.వి.శ్రవణ్‌కుమార్, ఆచార్య సుబ్బాచారి, డా.విజయవర్ధిని, డా.మెర్సీరత్నారాణి, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



